క్లుప్తంగా

సీనియర్ బాడీబిల్డర్ మృతికి నివాళి



బాడీబిల్డర్ ఎస్.కె. బాషాకు మృతికి నివాళి అర్పిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్: కడప నగరానికి చెందిన ఫ్రెండ్స్ జిమ్ సీనియర్ బాడీబిల్డర్ ఎస్.కె. బాషా మరణం పట్ల జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ ప్రతినిధులు నివాళులర్పించారు. జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ ప్రతినిధులు నూనె నగేష్, ఎస్ఎండీ యూనుష్‌బాషా, మయూరం రఘునందన్, న్యామతుల్లా ఖాజాబాషా తదితరులు ఎస్.కె. బాషా బాడీబిల్డింగ్‌కు చేసిన సేవలను కొనియాడారు. బాడీబిల్డర్స్ ఇటీవల కాలంలో వ్యాయామం చేస్తూ మృత్యువాత పడటం వెనుక వారికున్న అనారోగ్య కారణాలే తప్ప వ్యాయామం చేయడం కాదని వివరించారు. గుండెపోటుతో మరణించడం బాధాకరమని అశ్రునివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ జోనల్ ఇన్‌చార్జ్ నియామకం

కడప వైఎస్ఆర్ సర్కిల్: యూత్ కాంగ్రెస్ జోనల్ ఇన్‌చార్జ్‌గా మూరతోటి విజయ్ కుమార్‌ను ఐవైసీ ప్రెసిడెంట్, నేషనల్ ఇన్‌చార్జ్ ఉదయ్ భాను చిబ్, కృష్ణ అల్లవారు, సెక్రెటరీ మమత నాగిరెడ్డి, ఏపీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లక్కరాజు రామారావు నియమించినట్లు డీసీసీ అధ్యక్షురాలు విజయ జ్యోతి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తోటి విజయ్ కుమార్‌ను డీసీసీ అధ్యక్షురాలు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాలలో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు.

మాలల ద్రోహులు సీఎం, డిప్యూటీ సీఎం

ప్రొద్దుటూరు : మాలల ద్రోహులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోసమనోహర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మాల కులాన్ని అణగదొక్కడమే టీడీపీ, జనసేన పార్టీల వైఖరి అన్నారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు వన్‌మెన్ కమిషన్‌ను సీఎం చంద్రబాబు నాయుడు వేశారన్నారు. ఈ కమిషన్ రాజ్యాంగబద్ధమైనదా.. ఇది టీడీపీ కమిషన్ అన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా మాల కుల జనాభా ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయాలంటే ఏ కులానికి ఎన్ని ఉద్యోగాలు వచ్చాయో స్పష్టంగా ప్రతి ఒక్కరిని జల్లెడ పట్టి ప్రతి ఒక్కటీ బయటికి తీయాలన్నారు. మాల కులానికి 15 శాతం రిజర్వేషన్ ఇవ్వాలన్నారు. మాల కులానికి తీవ్ర అన్యాయం చేస్తున్న టీడీపీ, జనసేన పార్టీలకు రాబోయే రోజుల్లో ఓటు టు ద్వారా మాలలు బుద్ధి చెబుతారన్నారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు



జిరాఫీ చెస్ పోటీలో విద్యార్థులు

ప్రొద్దుటూరు : స్థానిక పుట్టపర్తి నారాయణాచార్యులు ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఆదివారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జిరాఫీ చెస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలసీమ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ లైబ్రేరియన్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎదుటివారిని ఓడించడానికి ఎత్తుకు పైఎత్తు వేస్తూ మీ చెస్ ఆటను ప్రారంభించాలన్నారు. ఆదివారం విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలను చదివి మీ భవిష్యత్తును చక్క దిద్దుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిరాఫీ చెస్ అకాడమీ కోచ్ నాగార్జునరెడ్డి, జేవీవీ కన్వీనర్ చంద్రశేఖర్‌రావు, ఆర్టీపీపీ ఇంజనీర్ ప్రభాకర్ రెడ్డి, గ్రంథాలయ అధికారిణి తిరుపతమ్మ, పాఠకులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పుష్పయాగం

పులివెందుల టౌన్ : పట్టణంలోని చిన్నరంగాపురం గ్రామ సమీపం కోతి సమాధి ఆలయ ప్రాంగణంలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో కార్తికమాసాన్ని పురస్కరించుకుని ఆదివారం అయ్యప్ప స్వామికి పుష్పయాగం నిర్వహించారు. అయ్యప్పస్వామి మూలవిరాట్‌ను రకరకాల పుష్పాలతో ముగ్ధమోహన రూపంగా అలంకరించి సహస్ర నామావళితో పుష్పయాగాన్ని అయ్యప్ప భక్తులచే భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవమూర్తిని ప్రత్యేక పలకీలో ఉంచి ఆలయం చుట్టూ మంగళ వాయిద్యాల నడుమ ప్రాకారోత్సవం నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప.. హరిహర పుత్ర అయ్యప్ప నామ జపాలతో పల్లకీ ఉత్సవం కనుల పండువగా సాగింది. అనంతరం పుష్పయాగం నిర్వహించి భక్తిశ్రద్ధలతో తాళాల భజనలతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అల్పాహారం(బిక్ష) ప్రసాదంతోపాటు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆలయ గురుస్వామి వెంకటరామిరెడ్డి, అయ్యప్ప భక్తులు, ఆలయ అర్చకులు పూజాది కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు.

అమ్మలా లాలించి...నాన్నలా ఆడించి

- ప్రత్యేక అవసరాల పిల్లల భవితవ్యానికి భరోసా
- అన్ని రకాల పిల్లలకు అండగా.. సేవలు మెండుగా
- దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపుతున్న భవితా కేంద్రాలు



ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సేవలందిస్తున్న ఐఈఆర్టీలు



ఫిజియోథెరపీ సేవలందిస్తున్న సిబ్బంది

అమ్మలా లాలించి.. నాన్నలా ఆడించి వారిని అక్కున చేర్చుకుంటూ సేవలందిస్తున్నాయి భవితా కేంద్రాలు. కొంతమంది పిల్లలు పుట్టుకతోనే వైకల్యం ఏర్పడి పదరాని ఇబ్బందులు పడుతుంటారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు (విద్యాంగులు) సమాజంలో ముందుకు సాగేందుకు అంగవైకల్యం అడ్డురాదు అని వారిలో ఆత్మస్థైర్యం నింపడంతోపాటు వారి తల్లిదండ్రులకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం భవితా కేంద్రాలను ఏర్పాటు చేసింది. అలాంటి భవితా కేంద్రాల ద్వారా ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లలకు అన్ని తామై సేవలందిస్తూ అండగా నిలుస్తున్నారు ఐఈఆర్టీలు. భవితా కేంద్రాలలో దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ, ఆటలు, పాటలతో పాటు విద్య, స్పీచ్ థెరపీ, పిజియోథెరపీ వంటి సేవలు, మెలకువలను నేర్పిస్తున్నారు.

కడప ఎడ్యుకేషన్: కడప నగరం ఎన్‌జీఓ కాలనీలో 2013లో భవితా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ 26 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు (బుద్ధిమాధ్యం, వికలాంగులు) సేవలందుకుంటున్నారు. అక్కడ ఉండే పిల్లలు బుద్ధిమాంధ్య, మానసిక వికలాంగులు, సెలబ్రల్‌పాల్సీ (నరాలవ్యాధి), ఆటిజం (బుద్ధిమాంధ్యం)అంటే ఏమీ తెలియని చిన్నారులు. అలాంటి వారికి ఒకటికి నాలుగుసార్లు చెబితే కానీ అర్థం చేసుకోలేరు. సొంతంగా పనులు చేసుకోలేరు. ఒకరి సాయం లేనితే నడవలేరు, తినలేరు. సొంతంగా ఏపని చేసుకోలేరు. ఇలాంటి పిల్లలకు సేవలందించేందుకు ఇద్దరు ఐఈఆర్‌టీలు ఏర్పాటు చేశారు. వారు వారికి కావాల్సిన అన్ని రకాల సేవలందిస్తూ వారితోపాటు వారి తల్లిదండ్రులకు ఎంతో తృప్తినందిస్తున్నారు.

ఎలాంటి సేవలందుతాయంటే...

భవితా కేంద్రాల్లో ఉండే ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు స్పీచ్ థెరఫీ, లైఫ్‌స్కిల్స్, రైటింగ్, రీడింగ్‌లతో పాటు ఆట, పాటలను నేర్పిస్తున్నారు. వారిలో వికలాంగులకు అవసరమైన ఫిజియోథెరపీ సేవలను వారానికి ఒక సారి అందిస్తుంటారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు మొదట్లో భవితా కేంద్రాల్లో చేరినప్పుటి పరిస్థితి ఇప్పుడు వారి పిల్లలో వచ్చిన మార్పులను చూసి ఆ తల్లిదండ్రులు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. భవితా కేంద్రంలో సిబ్బంది అందించే సేవలు ఎంతో గొప్పవని కొనియాడుతున్నారు.



కడపలో ఏర్పాటు చేసిన భవితా కేంద్రం

సేవ చేయడంలోనే సంతృప్తి



ప్రత్యేక అవసరాల పిల్లలకు సేవలందిస్తుంటే ఎంతో సంతోషంగా ఉంటుంది. వారిలో వచ్చిన మార్పులను చూస్తుంటే ఎంతో తృప్తినిస్తుంది. వారికి వైద్య సేవలందించడం, పెన్షన్లు ఇప్పించడంతో పాటు వారికి ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ వంటి సేవలు అందిస్తున్నాం. చాలా మంది ఇక్కడి వచ్చాక మెరుగపడ్డారు.


- విజయ, ఐఈఆర్టీ, భవితకేంద్రం, కడప

కొంత మార్పు వచ్చింది



మా పిల్లవాడి పేరు లక్ష్మీధర్. పుట్టకతోనే ఆటిజం(హైపర్ యాక్టివ్). దుస్తులు చింపుకోవడం, వస్తువులు లాక్కోవడం వంటి పనులు చేసేవాడు. అంతేకాదు ఏ సమయంలో ఏం చేస్తాడో తెలియని పరిస్థితి. ఆరు నెలల క్రితం భవితా కేంద్రంలో చేర్పించాం. ఇప్పుడు కొంత మార్పు వచ్చింది. చాలా సంతోషంగా ఉంది. **- లక్ష్మి, ఎన్‌జీఓ కాలనీ, కడప**

సెలబ్రల్ పాల్సీ సమస్య



మా కుమార్తె భవశ్రీ. సెలబ్రల్ పాల్సీ(నరాలవ్యాధి) సమస్య ఉండేది. భవితా కేంద్రంలో చేర్చాం. ఇప్పుడు ఆ పరిస్థితి తగ్గింది. ప్రస్తుతం పాప బాగుంది. దీంతో పాటు భవితా కేంద్ర సిబ్బంది వైద్యులతో మాట్లాడి మా పాపకు మెడికల్ సర్టిఫికెట్‌ను కూడా ఇప్పించారు. దీంతో మా పాపకు పెన్షన్ కూడా అందుతోంది.

- నరేష్, శంకరాపురం, కడప

శిక్షణతో మార్పు



నా కుమారుడు పేరు సాయి. ఆటిజం సమస్య ఉండేది. గోడలు దూకడం, పిల్లలను కొట్టడంతో పాటు విచిత్ర పనులు చేస్తుంటాడు. రెండేళ్ల క్రితం భవితా కేంద్రంలో చేర్పించాం. ఇక్కడ ఇచ్చిన శిక్షణతో మా వాడి ప్రవర్తనలో మార్పు వచ్చింది. భవితా కేంద్రం వాళ్లు సర్టిఫికెట్ ఇప్పించారు. దీంతో పెన్షన్ కూడా ఇస్తున్నారు. **- గంగాధర్, కడప**

టాలెంట్ టెస్ట్ పేరుతో దోపిడీ

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో కార్పొరేట్ పాఠశాలలు టాలెంట్ టెస్ట్ పరీక్ష పేరుతో వేల కోట్ల రూపాయలు వసూలు చేసి దోపిడీకి పాల్పడుతున్నాయని ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి ఆరోపించారు. ఆదివారం నగరంలోని ఓ కార్పొరేట్ పాఠశాలలో టాలెంట్ టెస్ట్‌తో నిర్వహిస్తున్న పరీక్షను వారు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థలు టాలెంట్ టెస్ట్ పేరుతో విద్యార్థులకి ఎక్కువ మార్కులు వస్తాయని వేల కోట్ల రూపాయలు వసూలు చేసి విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారన్నారు. తల్లిదండ్రులకు ఎక్కువ మార్కులు వస్తాయని, ప్రైజ్‌లు ఇస్తామని, హైయెర్ క్లాస్‌కు ప్రమోట్ చేస్తామని మాయా మాటలతో వసూలు చేస్తున్నారన్నారు. జిల్లాలోని విద్యాశాఖ అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటో చెప్పాలన్నారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం



రక్తదాన కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఖాదర్‌బాషా, కరీముల్లా

కడప ఎడ్యుకేషన్: రక్త దానం మరొకరికి ప్రాణదానం అని జేకే జనం కోసం సేవా సాంస్కృతిక క్రీడా విద్య అభివృద్ధి సంస్థ రాష్ట్ర అధ్యక్షులు లయన్ పటాన్ ఖాదర్ బాషా అన్నారు. పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాల సందర్భంగా రక్తదాన ప్రచార సేవకుడు అబ్దుల్ రాయల్ కరిముల్లా ప్రజలకు రక్తదాన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఖాదర్‌బాషా మాట్లాడుతూ యువత తమవంతుగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు.

టెక్నాలజీతో మానవాళికి మేలు జరగాలి



కవులను సత్కరిస్తున్న నిర్వాహకులు, అతిథులు

కడప కల్చరల్ : టెక్నాలజీతో మానవాళికి అవసరమైన మేలు జరగాలిగాని, మానవ సంబంధాలు విచ్ఛిన్నం కాకూడదని ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి అన్నారు. 57వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలో కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ పుస్తకం చదవడంలో ఉన్న తృప్తి టీవీలు, మొబైల్ ఫోన్లు చూడడంలో రాదన్నారు. మానవ మేధస్సును పెంచడంతోపాటు మానవ సంబంధాలను పెంచుకోవాలని సూచించారర. జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ ఈడీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య మాట్లాడుతూ జ్ఞాన సముపార్జన చదవడంతోనే సాధ్యమవుతుందన్నారు. గ్రంథాలయ కార్యదర్శి ఎస్.అమీరుద్దీన్, జీఎస్టీ ప్రొద్దుటూరు విభాగం అసిస్టెంట్ కమిషనర్ మోరంరెడ్డి వేణుగోపాల్ రెడ్డి కొండూరు జనార్ధన్ పాల్గొన్నారు.

కవి సమ్మేళనం

పోటీలలో భాగంగా బహుభాషా కవి సమ్మేళనం నిర్వహించారు. కవులు తెలుగుతో పాటు హిందీ, ఉర్దూ ఆంగ్లంలో కూడా తమ కవితలను వినిపించడం విశేషం. కొందరు కవులు పద్యాలు ఆలపించగా మరికొందరు గజల్ రూపంలో కవిత్వం చెప్పారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు అతిథులను, అనంతరం కవులను ఘనంగా సత్కరించారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



వైద్య శిబిరంలో రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ మహబూబ్ అలీ

కడప ఎడ్యుకేషన్: కడప నగరం మెడికేర్ హాస్పిటల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైయింది. శిబిరంలో డాక్టర్ మహబూబ్ అలీ పాల్గొని వైద్య సేవలందించారు. దాదాపు మూడు వేల విలువగల షుగర్, కొలెస్ట్రాల్, ఈసీజీ, న్యూరోపతి పరీక్షలను రోగులకు ఉచితంగా చేసినట్లు ఆయన తెలిపారు. చక్కెర వ్యాధి(డయాబెటిస్) అనేది శరీరంలో ఇన్సులిన్ హార్మోన్ ఉత్పత్తి పనితీరు తగ్గడం వల్ల వస్తుందన్నారు. రక్తంలోకి వచ్చే చక్కెర లేదా గ్లూకోజ్‌ను శక్తిగా మార్చే ప్రక్రియకు ఆటంకం ఎదురైనప్పుడు ఈ సమస్య బారిన పడే అవకాశాలు ఎక్కువని తెలిపారు. డయాబెటిస్‌కు మూల కారణం రక్తంలో చక్కెర (గ్లూకోజ్) ఎక్కువగా పోగవటమేనన్నారు. డయాబెటిస్ పట్ల అప్రమత్తంగా ఉండటంతోపాటు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలను చేయించుకోవాలన్నారు. అలాగే నిత్యం వ్యాయామంతోపాటు ఆహార నియమాలను పాటిస్తూ జాగ్రత్తలు తీసుకుంటే డయాబెటిస్‌ను నియంత్రణలో ఉంచుకోవచ్చన్నారు. శిబిరంలో సయిద్ నూర్, షాహిద్ పఠాన్, గౌతమి, అయేషా, భార్గవి, వైష్ణవి, శిరీషరెడ్డి, సబిహా, మాధవి, మహిత, సువర్ణ, మెడికల్ రెప్‌లు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం



గ్రామోత్సవంలో పాల్గొన్న అబ్బిరెడ్డి మల్లికార్జున రెడ్డి, అబ్బిరెడ్డి వీరారెడ్డి దంపతులు

వల్లూరు : మండలంలోని దుగ్గాయపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ దత్తాత్రేయస్వామి, గ్రామ దేవత గంగమ్మ ఆలయాల్లో జరుగుతున్న విగ్రహ ప్రతిష్టా మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన ఆదివారం దేవతా మూర్తుల గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీఎస్ఆర్టీసీ మాజీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, మాజీ జడ్పీటీసీ, వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి దంపతులు పర్యవేక్షణలో జరుగుతున్నాయి. ప్రతిష్టా మహోత్సవాల్లో వేద పండితులు విజయ్‌భట్టర్ ఆధ్వర్యంలో ఉదయం వేద పండిత బృందం పూజలను నిర్వహించారు. జలాధివాసంలో వున్న శ్రీ గంగమ్మతల్లి, శ్రీ దత్తాత్రేయస్వామి, గణపతి విగ్రహాలతోపాటు ఉత్సవ మూర్తులకు పూజలను నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాల నడుమ గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ప్రజలు పసుపుతో కూడిన నీటిని వారపోస్తూ తమ ఇళ్ల వద్దకు దేవతా మూర్తులను ఆహ్వానించి కాయ కర్పూరాలు సమర్పించారు. అనంతరం యాగశాలలో ప్రధాన కళశ స్థాపన చేశారు. నవ గ్రహ ఆరాధన అనంతరం మహా గణపతి, ఆవాహిత దేవతా, నవగ్రహ, ప్రధాన మూర్తి హోమాలను నిర్వహించారు. అనంతరం గణపతి, శ్రీదత్తాత్రేయస్వామి, గంగమ్మతల్లి విగ్రహాలతోపాటు వారి వాహనాలు, ఉత్సవ విగ్రహాలకు శయ్యాధివాసం నిర్వహించారు.

హోమంలో పాల్గొన్న వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

విగ్రహ ప్రతిష్టా మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన చండీ హోమంలో వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

వల్లూరు(చింతకొమ్మదిన్నె) : చింతకొమ్మదిన్నె మండల కార్యాలయంలో ఆదివారం మండల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి పాల్గొని మాట్లాడారు. మండలంలో నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆయన వివిధ శాఖలకు చెందిన అధికారులను ఆదేశించారు. ఉపమండలాధ్యక్షుడు వెంకటసుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ చెరువులకు గుర్రంగుంపు రిజర్వాయర్ నుంచి నీటిని కేటాయించి గుర్రంగుంపు సుగాలితండా, వేపమానుసత్రం గ్రామాలకు నీటిఎద్దడి లేకుండా చూడాలన్నారు. లింగారెడ్డిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలకు అదనపు గదుల నిర్మాణానికి స్థల సమస్య పరిష్కరించాలన్నారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పాపసాహెబ్‌పేట సర్పంచ్ సురేంద్రరెడ్డి తమ పంచాయతీ పరిధిలోని రోడ్ల సమస్యలను, పంటల ఇన్సూరెన్సు సంబంధిత సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే మూలవంక గ్రామస్తులు తమ గ్రామ శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలన్నారు. సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీవో కుల్లాయిబాబు, ఇన్‌చార్జి తహసీల్దార్ శివరామిరెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ చాంద్‌బాషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సీఐ శివశంకర్ నాయక్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

గృహాల కోసం దరఖాస్తు చేసుకోండి

పులివెందుల రూరల్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్తగా ఇళ్ల మంజూరు కోసం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ డీఈ రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి హౌసింగ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు, అకౌంట్ బుక్, ఆదాయ సర్టిఫికెట్, జీరాక్స్ కాపీలు తీసుకుని హౌసింగ్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

19 నుంచి ఆధార్ మొబైల్ కేంద్రాలు

కమలాపురం : నగర పంచాయతీ పరిధిలోని 3వ, 4వ వార్డు సచివాలయాల్లో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు ఆధార్ మొబైల్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 26 నుంచి 29వ తేదీ వరకు కోగటం, చిన్నచెప్పలి గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఎంపీడీఓ తెలిపారు. ఈ కేంద్రాల్లో 0–5 సంవత్సరం పిల్లలకు ఆధార్ అప్‌డేట్ చేయడంతో పాటు ఆధార్ కార్డులో చిరునామా, ఫొటో మార్పు, ఆధార్‌కు ఫోన్ నెంబర్ లింక్, వేలి ముద్రలు అప్‌డేట్ చేయుట తదితర సేవలు అందిస్తామని ఆమె తెలిపారు. విద్యార్థులతో పాటు అన్ని వయస్సుల వారు ఈ ఆధార్ మొబైల్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

రేపు మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలతో పాటు ప్రత్యేక అలంకరణ ఉంటుదని పేర్కొన్నారు. ఉదయం 7 గంటలకు జరిగే లోక కల్యాణార్థం గణపతి, నవగ్రహ, మృత్యుంజయ హోమంలో భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

ఎస్సీవర్గీకరణకు అడ్డు తగులుతున్న మాలలు

జమ్మలమడుగు : ఎస్సీ వర్గీకరణకు మాలలు అడ్డు తగులుతూనే ఉన్నారని ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దండువీరయ్య మాదిగ తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మాదిగలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ కోసం ప్రత్యేక చర్యలను తీసుకోవాలన్నారు. ఉపకులాల గణాంకాలను నిష్పక్షపాతంగా సేకరణ చేయాలన్నారు. దీంతో బోగస్ కులాలకు ఏకసభ్య కమిషన్ అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

విద్యార్థుల హక్కుల కోసం పోరాటాలు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్ఆర్ సర్కిల్: విద్యార్థులు హక్కుల కోసం పోరాటాలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభల్లో భాగంగా రెండ రోజు ఏఐఎస్ఎఫ్ జెండాను అవిష్కరించి ప్రతినిధుల సభలో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు హెచ్చరిల్లిపోతున్నాయని, వాటిని పాలక ప్రభుత్వాల పరిష్కరించే దిశగా ఆలోచన చేయాలన్నారు. ఇవాళ జిల్లాలో యోగివేమన యూనివర్సిటీ విశ్వవిద్యాలయంలో వీసీ నియామకం మొదలుకొని, విద్యార్థుల మౌలిక వస్తువుల వరకు, అడుగడుగునా అధికారా అనుయాయులు రాజ్యమేలుతున్నట్లు తెలిపారు. యూనివర్సిటీ అభివృద్ధి, నిధుల కోసం పోరాటం మరింత ముందుకు తీసుకొని పోవాలన్నారు. అలాగే ఆర్కిటెక్ యూనివర్సిటీ అక్రమ నియామకాలపై, పులివెందుల మెడికల్ కళాశాల సీట్ల కేటాయింపు పై ప్రభుత్వ వైఖరి సరైనది కాదన్నారు. ఫార్మసీ కళాశాలల నిలువు దోపిడీ, ఇంజినీరింగ్, పాలిటెక్నికల్, ఐటిఐ ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ సంక్షేమ వసతి గృహాల సొంతభవనాలు, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు కోసం పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె శివశంకర్, జి వలరాజు, బి తేజ, లీలాకృష్ణ, పీటర్, వెంకట్ రెడ్డి, అరుణ్, చంద్ర, ప్రతినిధులు పాల్గొన్నారు.

సందడిగా బాలల వేమన పద్య పోటీలు



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో నిర్వాహకులు

కడప కల్చరల్ : రెడ్డి సేవా సమితి రజతోత్సవ సందర్భంగా ఆదివారం కడప నగరం శివశివాని హైస్కూలులో కడప ప్రాంత బాలలకు నిర్వహించిన వేమన పద్య పోటీలు సందడిగా నిర్వహించారు. ఇప్పటికే ప్రొద్దుటూరు, రాజంపేట డివిజన్లలో ఈ పోటీలు నిర్వహించి విజేతలను తుది పోటీలకు ఎంపిక చేశారు. కాగా కడప డివిజన్‌కు సంబంధించిన ఈ పోటీలకు 635 మంది విద్యార్థులు హాజరయ్యారు. న్యాయ నిర్ణేతలు 22 మందిని ప్రాథమిక పోటీలకు ఎంపిక చేసి ముగ్గురిని కడప డివిజన్ విజేతలుగా ప్రకటించారు. నాగార్జున మోడల్ స్కూలుకు చెందిన మాచిరాజు శ్రీవైష్ణవి, బీవీ జాహ్నవి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి రూ. 5000, రూ. 3000 కైవసం చేసుకున్నారు. అక్కాయపల్లె పవన్ స్కూలుకు చెందిన కె.లక్ష్మీకీర్తన పవన్ తృతీయ స్థానంలో నిలిచి రూ. 2000 నగదును సాధించారు. రెడ్డి సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ కుప్పిరెడ్డి నాగిరెడ్డి ఈ పోటీలను పర్యవేక్షించారు. ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, కోశాధికారి గుడ్ల ఆదినారాయణరెడ్డి, ఇతర సభ్యులు మదుసూదన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వెంకట రెడ్డి, నాగేశ్వరరెడ్డి, ఏపీ రెడ్డి జనసంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ మద్దికె సుబ్బారెడ్డి, ఎస్వీ రమణారెడ్డి ప్రధాన కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక ప్రముఖులు లయన్ పోతుల వెంకట్రామిరెడ్డి దాదాపు 800 మంది విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించారు. డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరచారి, డాక్టర్ పొదిలి నాగరాజు, డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి, డాక్టర్ జీవీ సాయిప్రసాద్, డాక్టర్ కోడూరు స్వతంత్రబాబు, వరలక్ష్మి, డాక్టర్ గంగన్నపల్లె వెంకటరమణ, రాయుడు, దామోదరమ్మ, శ్రీదేవి పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

శిల్పారామంలో చిన్నారుల సందడి



శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. కడప నగరం చిన్నచౌకులోని ఓ పాఠశాల చిన్నారులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. వారి నృత్యాలకు సందర్శకుల నుంచి విశేష స్పందన లభించింది. శిల్పారామం పాలనాధికారి మునిరాజు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

బుగ్గవంక ప్రాజెక్టు ఆనకట్టకు రక్షణ ఏదీ ?



ప్రాజెక్టు ఆనకట్టపై ఉన్న ముళ్ల పొదలు



ప్రాజెక్టు రహదారి చుట్టు పెరిగిన కంపచెట్లు

- ఆనకట్టపై ప్రమాదకరంగా పెరిగిన కంప చెట్లు

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగర శివార్లలోని చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని బుగ్గవంక ప్రాజెక్టు ఆనకట్టపై ఉన్న ఉన్న ముళ్ళ పొదలు ప్రాజెక్టుకు ప్రమాదకరంగా మారుతున్నాయి. బుగ్గవంక ప్రాజెక్టు కుడి వైపున ఉన్న ఆన కట్టపై మొత్తం ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. ప్రాజెక్టుకు కింద నుంచి ఏర్పాటు చేసిన రహదారి మొత్తం కంప చెట్లతో నిండి ఉండటంతో ప్రజలు ప్రాజెక్టును సందర్శించేందుకు వెళ్లేందుకు వీలుగా లేకుండా కంప చెట్లు అడ్డుగా ఉన్నాయి. ఇప్పటికే ప్రాజెక్టుకు వర్షపు నీరు కొండల ప్రాంతం నుంచి వస్తుడటంతో ప్రజలు, రైతులు సందర్శించేందుకు వస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రాజెక్టుపై ఉన్న కంప చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.